క్లుప్తంగా

బీఎన్ఆర్‌కు వెలంపల్లి పరామర్శ



భవానీపురం(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బెవర్ నాగేశ్వరరావు (బీఎన్ఆర్)ను మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివసిస్తున్న బీఎస్ఆర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వెలంపల్లి, పార్టీ మైనార్టీ నాయకుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ బీఎస్ఆర్ నివాసంలో ఆయనను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

క్విజ్‌లో ఈఎన్‌టీ పీజీ ప్రతిభ




లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడలో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ జరిగిన ఈఎన్‌టీ వైద్యుల దక్షిణ భారత సదస్సులో సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన ఈఎన్‌టీ విభాగం పీజీ డాక్టర్ ముకుందన్ క్విజ్‌లో రజత పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా ముకుందన్‌తో పాటు, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కె.రవిని మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అభినందించారు.

సీపీఆర్‌పట్ల అవగాహన పెంపొందించుకోవాలి



భవానీపురం(విజయవాడ పశ్చిమ): కార్డియాక్ పల్మనరీ రీసక్సినేషన్ (సీపీఆర్)పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీపీఆర్ ప్రోగ్రామ్ లయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు అన్నారు. సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో గొల్లపూడిలోని అట్కిన్‌సన్ పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఆర్ ప్రాథమిక చికిత్స వల్ల వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన వాళ్లం అవుతామని వివరించారు. సీపీఆర్ విధానంపై డాక్టర్ కోలా విజయశేఖర్ డెమో ఇచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని సీపీఆర్ ద్వారా రక్షించవచ్చని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి పొన్నూరు హరినాథ్ ప్రసాద్, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బుధవారం సాయంత్రం 5 గంటలకు భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని ఆల్మైటీ నర్సింగ్ హోమ్‌లో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

19న సీఐటీయూ మహాసభలు



పటమట(విజయవాడ తూర్పు)పటమట(విజయవాడ తూర్పు): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారాని కోరుతూ ఈనెల 19వ తేదీన సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల 16వ మహాసభలు నిర్వహిస్తున్నామని సీఐటీయూ విజయవాడ తూర్పు నగర అధ్యక్షులు వీబీరాజు తెలిపారు. మంగళవారం నగరంలోని పటమట, గుణదల ప్రాంతాల్లో నగర మహాసభ కార్యక్రమ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. నగరంలోని రాణిగారి తోట మున్సిపల్ బిల్డింగ్‌లో ఈ సభలు జరుగనున్నాయని.. సభకు వివిధ రంగాల కార్మికులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున్న ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బిల్డింగ్ గుణదల కమిటీ అధ్యక్షులు పి.పాండురంగారావు, కార్యదర్శి కె.రాజేష్, కోశాధికారి ఎస్.రాజు, పి.అశోక్, టి.వీరయ్య, ఎన్.మోషే, కోక్కిలిగడ్డ శేఖర్, కె.అజార్, ఎన్.రాజు కె.చిన్నారావు, ఎన్.అంతోని పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: పెనమలూరులో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా దెందులూరుకు చెందిన ఫిర్యాది జె.సింహాచలం కొన్నేళ్ల క్రితం విజయవాడ కృష్ణలంకకు చెందిన మహిళను వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె. భార్యాభర్తల తగువ కారణంగా భార్య పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఫిర్యాది భార్య పెనమలూరు పల్లిపేటకు చెందిన వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిసి ఫిర్యాది సోమవారం పెనమలూరుకు వచ్చి ఆ వ్యక్తిని నిలదీశాడు. దీంతో ఆ వ్యక్తి ఇనుప రాడ్‌తో సింహాచలంపై దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

• అనధికారిక పార్కింగ్‌తో అవస్థలు





పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల అనధికారిక పార్కింగ్‌తో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలోని ప్లాట్‌ఫాంల వద్ద ఇష్టానుసారం వాహనాలను నిలుపడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. బస్‌స్టేషన్ ఆవరణలో అధికారికంగా వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు సౌకర్యం ఉన్నా.. అక్కడ రుసుము చెల్లించాలనే నెపంతో చాలా మంది బస్‌స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫాంలు, సిటీ టెర్మినల్‌లో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి వెళ్లిపోతున్నారు. దీంతో బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆర్టీసీ డ్రైవర్లు వాపోతున్నారు.

– బస్టాండ్ (విజయవాడ పశ్చిమ)

కీలక ప్రగతి సూచికల లక్ష్య సాధనలో అలసత్వం వద్దు

జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కీలక ప్రగతి సూచికల (కేపీఐ) లక్ష్యాల సాధనకు ప్రతి శాఖ కృషి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కీలక ప్రగతి సూచికలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కేపీఐల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. వార్షిక తలసరి ఆదాయ వృద్ధితో పాటు వృద్ధిరేటు 18 శాతం ఉండాలన్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. వార్షిక రుణ ప్రణాళికలకు అనుగుణంగా రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. మత్స్య రంగ విస్తరణపై



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

దృష్టి సారించాలన్నారు. సహకార సంఘాల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులు నేరుగా రైతుకు చేరేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రతి మంగళవారం కీలక ప్రగతి సూచికలపై సమావేశం నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. సీపీవో వై.శ్రీలత, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడ తూర్పు): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అక్కడున్నవారంతా అప్రమత్తంగా ఉండాలని.. అధైర్యపడకుండా మంటలను అదుపులోకి తీసుకునే నైపుణ్యాలను నేర్చుకోవాలని వీఎంసీ స్టేషన్‌ఫైర్ అధికారి నరేష్ అన్నారు. వీఎంసీ అగ్ని ప్రమాద నిరోధక విభాగం ఆధ్వర్యంలో ప్రమాదాల సమయంలో తీసుకునే చర్యలపై బందరు రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్ కాంప్లెక్, అభయ ఆస్పత్రి సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, ప్రమాదం జరిగినప్పుడు మంటలను అదుపు చేసే



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న షాపింగ్ మాల్ సిబ్బంది

నైపుణ్యం, నిరోధక పరికరాలను వినియోగించే విధానం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగాధిపతి స్వప్నకు అవార్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గడల స్వప్నకు సాలైట్ ఇంటర్నేషనల్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డు లభించిన సందర్భంగా మంగళవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో ఇటీవల జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ గడల స్వప్నకు అవార్డు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్, ఇగ్నో విజయవాడ రీజనల్ డైరెక్టర్ కె.సుమలత, ప్రొఫెసర్ డాక్టర్ ఏ పూర్ణ చంద్రనాగరాజు తదితరుల చేతలమీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గడల స్వప్నను కళాశాల అధ్యాపకులు సిబ్బందితో కలిసి అభినందించారు.



డాక్టర్ గడల స్వప్నను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): హెచ్ఐవీ నివారణకు సిబ్బంది సమన్వయంతో పని చేయడంతో పాటు వ్యాధి సోకిన వారికి మెరుగైన సేవలు అందించాలని డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ బి.భానూనాయక్ సూచించారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని డీఎల్ఏటీవో కార్యాలయంలో మంగళవారం ఏఆర్టీ, ఐసీటీసీ, బ్లడ్‌బ్యాంక్, డీఎస్ఆర్‌సీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఆయన ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. నాకో, ఏపీశాక్స్ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచన చేశారు. చికిత్స కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలన్నారు. అలానే ఉద్యోగులు సమయ పాలన పాటించాలని.. త్వరితగతిన వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సేవలను క్షేత్రస్థాయిలో అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో అవసరమైన మారుమూల ప్రాంతాలలో మొబైల్ ఐసీటీసీ ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి హెచ్ఐవీ సోకిన వారిని త్వరితగతిన గుర్తించి ఏఆర్టీ చికిత్స అందించాలన్నారు. సమీక్షలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శ్యాంసన్, డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్‌వైజర్ వీరాస్వామి రానున్న రోజుల్లో చేయాల్సిన లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాలోని ఏఆర్టీ, ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, బ్లడ్‌బ్యాంక్, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భానూనాయక్

సైబర్ మోసాలపై అవగాహన అవసరం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): సైబర్ మోసాలపై అవగాహన ఉండాలని కొత్తపేట సీఐ సీహెచ్ కొండలరావు అన్నారు. పోలీస్ శాఖ సహకారంతో కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. సోషల్ మీడియా, గేమ్స్, ఆన్‌లైన్ క్లాసులు, యాప్స్ వంటి వాటిని విద్యార్థులు తరచుగా ఉపయోగించడం వల్ల సైబర్ మోసాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మోసగాళ్లు పంపే సందేశాలను క్లిక్ చేయకూడదని సూచించారు. నమ్మదగిన వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే లాగిన్ చేయాలన్నారు. ఏదైనా అనుమానాస్పద ఘటన లేదా సైబర్ నేరం జరిగితే వెంటనే తల్లిదండ్రులకు, కళాశాల అధికారులకు చెప్పి ఫిర్యాదు చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పబ్లిక్ వైఫై ద్వారా యూపీఐ చెల్లింపులు చేయకూడదన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎస్.సాంబశివరావు, పి.గౌతమీదేవి, డి.పవన్ కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



మాట్లాడుతున్న సీఐ కొండలరావు

22 నుంచి కార్తిక మాసోత్సవాలు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): కొత్తపేట వీరాంజనేయ స్వామివారి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివారి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి కార్తిక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాస రావు శర్మ మంగళవారం పేర్కొన్నారు. కార్తికమాసంలో విశేష పర్వదినాలైన ఏకాదశి, కార్తిక సోమవారాలు, మాస శివరాత్రి, కార్తిక పౌర్ణమి, కార్తిక అమావాస్య రోజున స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. కార్తిక పౌర్ణమిన స్వామివారి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన పౌండర్ నందిపాటి శ్రీనివాసరావు, ఆలయ ఈవో వై.సీతారామయ్యలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేటీకరణను నిరసిస్తూ సంతకాల సేకరణ

లబ్బీపేట(విజయవాడ తూర్పు): నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. ప్రభుత్వ వైద్యాన్ని ప్రైవేటు పరం చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు నిరసిస్తున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్‌లో కార్పొరేటర్ కుక్కల అనిత ఆధ్వర్యంలో మంగళవారం సీతారామపురం ప్రాంతంలో సంతకాల సేకరణ చేపట్టారు. వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ సంతకాలు సేకరిస్తున్నట్లు ప్రజలకు వివరిస్తున్నారు. ఈ అంశంపై ప్రతి ఒక్కరూ తమ మద్దతు తెలుపుతున్నారు.

అత్తింటి వేదింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): వివాహితను వేదింపులకు గురిచేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. వించిపేట మధిర వారి వీధికి చెందిన యువకుడిని బాధితురాలు 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా భర్తతో పాటు అత్త, మామ, బావ మానసిక, శారీరకంగా వేదింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు వాపోయారు. గతంలో ఒకసారి విడాకులు కావాలని భర్త బాధితురాలిని కొట్టి ఇంటి నుంచి పంపగా పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నారు. అయినప్పటికీ భర్త తీరులో మార్పురాకపోగా వేదింపులు అధికమవ్వడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): శ్రీరాముని జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పాల ప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలో మంగళవారం స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఉదయం శ్రీసీతారామ, లక్ష్మణస్వామి వార్లకు విశేష పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణను ఘనంగా ఏర్పాటు చేశారు.

కార్మికులకు అండగా సీఐటీయూ పోరాటాలు

ఇబ్రహీంపట్నం: అసంఘటిత రంగ కార్మికులకు అండగా సీఐటీయూ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, క్వారీ, క్రషర్‌లు, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, కార్మికుల వలసలను అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

పెనమలూరు: లింగ వివక్షత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీబీకే సుధారాణి తెలిపారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధారాణి మాట్లాడుతూ.. బాలికలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. లింగ వివక్ష లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ విజిటర్(హెచ్‌వీ) నిర్మల మాట్లాడుతూ.. బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. బాలికల సంక్షేమానికి అందరూ సహకరించాలని తెలిపారు. అబ్బాయిలు, అమ్మాయిలు సమానమేనని అన్నారు. నేడు బాలికలు ఉన్నత చదువులు చదవడానికి చక్కని అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మయ్య, ఎంఎల్‌హెచ్‌పీ షైనీ, ఉపాధ్యాయులు డీవీ సుబ్బారావు, విజయలక్ష్మి, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరిస్తే వైద్యం అందని ద్రాక్షే

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజలను చైతన్యవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల రానున్న కాలంలో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కూటమి సర్కార్ చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని, ప్రజలకు జరిగే నష్టాన్ని జనానికి వివరించాలని, కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యమై జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మెడికల్ సీట్లు వద్దని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేద ప్రజలకు ఉచిత వైద్యం అందదని ఆయన వివరించారు.



కోటి సంతకాల సేకరణపై పార్టీ శ్రేణులకు వివరిస్తున్న వెలంపల్లి

కోటి సంతకాలు సేకరించాలి..

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారి మద్దత్తు కోరాలని వెలంపల్లి సూచించారు. తద్వారా కోటి సంతకాలు సేకరించవలసిందిగా పార్టీ నాయకులను ఆదేశించారు. నవంబరు 24వ తేదీ వరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దశల వారీగా నిర్వహిస్తామన్నారు. గతంలో రాష్ట్రంలో 12 మెడికల్ కళాశాలలు ఉండగా, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దాదాపు 17 మెడికల్ కళాశాలలకు భూములు కేటాయించి నిర్మాణ పనులను ప్రారంభించారన్నారు. అందులో ఏడు మెడికల్ కాలేజీల నిర్మాణాలు పూర్తిచేసి వైద్య విద్యను కూడా ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో ప్రారంభించారన్నారు. ప్రైవేట్ వ్యక్తుల లాభాపేక్ష కోసం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

పెట్టుబడి సాధనాలపై అవగాహన పెంచుకోవాలి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు పెట్టుబడి సాధనాలపై అవగాహన పెంచుకోవాలని కార్పొరేట్ ట్రైనర్ విజయకుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజిమెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెకక్యూరిటీస్ మార్కెట్స్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ పేరుతో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన విజయకుమార్ పెట్టుబడి ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత ఆర్థిక నిర్ణయాల సామర్థ్యంపై అవగాహన కల్పించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పెట్టుబడి రంగానికి సంబంధించి అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, అధ్యాపకులు ఎస్.వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో విజయకుమార్

రచనలతో చైతన్యం చేయడం అభినందనీయం

గిరిజన గీత శిల్పి బొండా జగన్‌మోహన్‌రావు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న అబ్దుల్ రజా హుస్సేన్ అభినందనీయులని గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు ప్రశంసించారు. ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ అబ్దుల్ రజా హుస్సేన్ మంగళవారం భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని బొండా ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఈ సందర్భంగా తాను చిత్రించిన రజా హుస్సేన్ కాన్వాస్‌ను జగన్‌మోహన్‌రావు ఆయనకు బహూకరించి శాలువాతో సత్కరించారు. అనంతరం బొండా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ.. రచయిత, జర్నలిస్ట్‌గా ప్రజా సమస్యలపై రజా హుస్సేన్ చేసిన పలు సేవలను కొనియాడారు. సత్కార గ్రహీత రజా హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రతిభను గుర్తించి, గౌరవించడంలో బొండా జగన్‌మోహన్‌రావు ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్రకారులు పి.చంద్రశేఖర్, ఉదయ్ శంకర్ చల్లా, వై.కళాసాగర్, రచయిత గోలి మధు తదితరులు పాల్గొన్నారు.



రజా హుస్సేన్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న జగన్‌మోహన్‌రావు

స్వచ్ఛత పక్వాడలో డివిజన్ ఉద్యోగుల కృషి అభినందనీయం

డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్(విజయవాడ సెంట్రల్): విజయవాడ డివిజన్‌లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగుల కృషి అభినందనీయమని డీఆర్ఎం మోహిత్ సోనాకియా పేర్కొన్నారు. మంగళవారం డీఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫిరేన్స్‌హాల్‌లో ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. డివిజన్ వ్యాప్తంగా స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్, కార్యాలయాలు, కాలనీలలో పరిశుభ్రతను పెంచడంలో అధికారులు, ఉద్యోగులు సాధారణ విధులకు మించి కృషి చేశారని కొనియాడారు. పరిశుభ్రత, వ్యర్థాల నిర్వాహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణలో ప్రయాణికులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో సిబ్బంది అవలంబించిన వినూత్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. డివిజన్‌లో పరిశుభ్రతను ప్రచార కార్యక్రమంగా కాకుండా రోజువారి సంస్కృతిలో భాగం చేయడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం స్వచ్ఛ రైలు–స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని ప్రదర్శించిన అధికారులు, సిబ్బందిని డీఆర్ఎం ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పి.ఇ.ఎడ్విన్, పలు బ్రాంచ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

డ్రోన్ సహాయంతో అవుట్‌ఫాల్ డ్రెయిన్ పరిశీలన

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని కెనాల్స్, అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాల గుర్తింపునకు డ్రోన్‌లు వినియోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం అజిత్ సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ రోడ్, జేఎన్ఎన్ఆర్‌యూఎం (జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్) ఇళ్లు, ఎక్స్‌ఎల్ ప్లాంట్, వాంబే కాలనీ, డిస్నీ ల్యాండ్ రోడ్ ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అజిత్ సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ రోడ్డు వద్ద గల అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను డ్రోన్ ద్వారా పరిశీలించి అందులోని వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో ఇన్‌చార్జి పర్యవేక్షణ ఇంజినీర్(వర్క్స్) శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర